# ముగ్గురత్తగార్లు

సత్కార్యానికి వెయ్యి విఘ్నాలంటారు! కాకపోతే నాంచారయ్య కాళ్ళు పడుతుండగా, కిటికీ తలుపులు నాల్గింటిలో తగుమాత్రం గాలి రావడానికి వీలుగా ఒక్క తలుపుమాత్రమే తెరిచి పెట్టుకుని, పట్టెమంచంపైన పాలసముద్రంలా పరుచుకున్న తెల్లటి మెత్తమీద పడుకుని మెల్లమెల్లగా నిద్రలోకి జారుకుంటున్న మునసబుగారికి నిద్రాభంగమా?!

ఆయన వులికిపడి కళ్ళు తెరిచేశారు! ఇందాక ఏ శబ్దంవల్లనైతే నిద్రాభంగం వాటిల్లిందో, అదే శబ్దం మళ్ళీ ఒకసారి ఆయన చెవుల్లో మారుమ్రోగింది.

నుదురు చిట్లించుకుంటూ, కళ్ళు కుంచించుకుంటూ "ఏమిటది?" అన్నారు మునసబుగారు.

"హరికథ జరుగుతోంది బాబూ! తమకు తెలీదేమిటి?" అని కాసేపాగి "మీకు తెలియకుండానే!" అంటూ ఆశ్చర్యాతిరేకంతో కళ్ళు పెద్దవి చేసుకుని అలాగే నోరు తెరిచేశాడు నాంచారయ్య.

తామరచెరువు గ్రామ చరిత్రలో ఇది అపూర్వమైన విషయం.

'తనకు తెలియకుండానే హరికథా?' మునసబుగారి కళ్ళల్లో ఒకటి పూర్తిగా మూసుకపోయింది. మరొకటి అరమోడ్పు భంగిమలో వుండిపోయింది. క్రింది పెదవి ఒకవైపున పైకిలేచి, మరొకవైపున పై పంటిక్రింద నలిగిపోయింది. నాలుగైదు క్షణాల క్రితం ఆ ముఖంలో లీలగా రెపరెపలాడిన చిరుకోపం, చేటంత మబ్బు దిక్కుల అంచులదాకా వ్యాపించినట్టుగా, అంతలోనే మునసబుగారి మనసంతటా వ్యాపించింది.

ఆయన తటాలున పైకి లేచారు. పదడుగుల్లో గదీ, హాలు దాటుకుని డాబా పైకి వచ్చారు. పిట్టగోడ కానుకుని ఊరివైపు చూశారు.

భజనగుడి ముంగిట పెట్రమాక్సు లైటు ధగద్ధయమానంగా వెలిగిపోతూ వుంది. ఆ వెలుగులో, ప్రొద్దు గ్రుంకిన తర్వాత వేసిన కొబ్బరిమట్టల పందిరి పచ్చపచ్చగా కలకలలాడిపోతూ వుంది. పందిరిక్రింద చెంగులు జీరాడగా పీతాంబరం కట్టుకున్నవాడు, మెడలోనుంచీ మోకాళ్ళదాకా వ్రేలాడుతున్న పుష్పహారాన్ని ధరించినవాడు, ఎదకు చేతులకూ చందనం అలదుకున్నవాడు, నుదుట పట్టెనామాలు దిద్ది తీర్చుకున్నవాడూ అయిన హరిదాసు చేతులు పైకెత్తి, అంజలి ఘటించి, ఉపోద్ఘాతానికి పరిసమాప్తిని సూచిస్తూ గోవిందనామ స్మరణ చేస్తున్నాడు –

"జయ రమా రమణ గోవిందా!"

"గో...విందా!" చిన్నా పెద్దా ఆడా మగా వ్యత్యాసం లేకుండా ఒక్కసారిగా నాలుగైదు వందల కంఠాలనుంచీ వెలువడిన గోవిందనామస్మరణ భజన గుడినుంచీ గ్రామ చావడిదాకా కూర్చున్న జనాన్ని దాటుకుని, మధ్యలో వున్న యిళ్ళనూ, ఆ తరువాత ప్రహరీగోడను పూలతోటనూ దాటుకుని 'అలవైకుంఠపురంబులో, నగరిలో, ఆ మూల సౌధంబుదాపుల' అన్నట్టుగా భవనంలో రెండో అంతస్తులో వున్న మునసబుగారి చెవుల్లో మళ్ళీ ఒకసారి మారుమ్రోగింది.

ఆయన గిరుక్కున వెనుదిరిగారు.

"ఏమిటి బాబూ?" అన్నాడు నాంచారయ్య.

"ఈ కరణానికీ, ప్రెసిడెంటుకూ తలపైన కొమ్ములు మొలిచాయిరా!" అన్నాడు మునసబుగారు.

"కాదా మరి! తమతో మాటాడకుండానే తమంతట తామే హరికథ పెట్టిస్తారా? పిదప కాలమొచ్చింది బాబూ, మనుషులకు అంతరాంతరాలు తెలీటంలేదు." అగ్గిపైన గుగ్గిలం చల్లసాగాడు నాంచారయ్య.

"ఒరే నాంచారూ!"

నాంచారయ్యకు ఈ పరిణామం ఎంతో ఆనందకరంగా వుంది. అతడు చేతులు కట్టుకుని, మునసబుగారి ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

"ఈ మధ్య ఆ కరణమెందుకో మిడిసిపడుతున్నాడు. ఆ ప్రెసిడెంటుది నడమంత్రపు సిరి! నాతో మాటాడకుండా ఓ హరికథ జరిపిస్తే తమ ప్రతాపం బయటపడుతుం దనుకున్నారేమో! ఏడ్చారుగానీ, ఒరే నాంచారూ!"

"బాబూ!"

"మనం ప్రత్యేకంగా ఓ కథ పెట్టించాలి...."

"అదెంతపని బాబూ!"

"వెళ్ళు. రేపు రాత్రికి కథ మనదని చెప్పి తాంబూలమిచ్చిరా!"

మునసబుగారి మాటతోబాటే నాంచారయ్య గబగబా మెట్లుదిగాడు. అరకట్ట ఆకులు, పలం వక్కలు చేతబట్టుకున్నాడు. తలుపు తెరచుకుని వీధిలోబడి చరచరా భజన గుడివైపు నడవసాగాడు.

* * *

ఇప్పుడు చెప్పబోయేది పూర్వకథ

హార్మోనియం వాయించే హనుమంతు, మృదంగం మ్రోగించే సుబ్బయ్య వెంటరాగా ఆ రోజు వుదయం ఎనిమిది ఎనిమిదిన్నరకే హరిదాసు ఆ గ్రామంలో ప్రవేశించాడు.

హరిదాసుకు ముప్పైయ్యేళ్ళు వుండొచ్చు. కడ్డీలాంటి శరీరం, పొడుగాటి చేతులు, చామనఛాయ. వీటితో శ్రీరామచంద్రుని వేషానికి అనువైన ఆకారం అతడిది. ఉంగరాల జుత్తు గిరజాల రూపంలో వుండి ఆ ఆకారానికొక ఆకర్షణను ఆపాదిస్తూ వుంది.

అప్పటికప్పుడే నిద్రలేచి, తూలుతూ తూలుతూ రచ్చదాకా వచ్చి, పొలంవైపు వెళ్ళడమా, లేక యిళ్ళకే తిరిగివెళ్ళి వంటగదిపైకెగబడ్డమా అని పాలుపోక, దినకృత్యాలనే గ్రంథానికి బీడి పొగలతోనే శ్రీకారం రచిస్తూవున్న యువకులు కొందరు, ఏదో ఉబుసుపోకకు ఒక మానవుడు దొరికాడుగదా అన్న తృప్తితో "రండి రండి దాసుగారూ! ఎక్కడనుంచీ వస్తున్నారు? ఇంతకు మునుపెప్పుడూ మిమ్మల్ని చూచినట్టు లేదే! మందేవూరు?" అని పలకరించారు.

"కంచుగొంతు కేశవదాసుగారంటే తెలుసునుగదండీ! ఈ ప్రాంతమంతా ఆయనకు కొట్టినపిండి. ఆయన మా నాన్నగారు?" అన్నాడు హరిదాసు.

"అలాగా! కాస్త దగ్గరికొస్తావా బాబూ! చూపు తిన్నగా ఆనడం లేదు. భజన గుడి కట్టిన కొత్తలో నాలుగు సంవత్సరాలు వరుసగా ప్రతి శ్రీరామనవమికీ నాన్నగారీవూళ్ళో కథలు చెప్పారు. కేశవదాసుగారి కథంటే చుట్టుపట్ల పదిమైళ్ళ నుంచీ కదలివచ్చేది జనం!

కూచోండి బాబూ, కూచోండి" అంటూ రచ్చపైన రావిచెట్టుకు ఆనుకుని కూర్చున్న రంగయ్యతాత హరిదాసుకి స్వాగతం యిచ్చాడు.

నిగనిగలాడుతున్న నీరెండకు ముఖంలో ముత్యాల్లా అలముకున్న చెమటబొట్లను అంగవస్త్రంతో తుడుచుకుని, హరిదాసు అనుచరులతోబాటు చల్లటి రావిచెట్టు నీడలో కూర్చుంటూ "మీ వూరిని గురించి మా నాన్నగారి నోట చాలాసార్లు విన్నానండీ తాతగారూ! 'కాకుల్లాగా కడుపునింపుకోడం కోసం బ్రతికేవాళ్ళ మాట కేంగానీ, విద్యకు వెలగట్టి విద్వత్తును గౌరవించే పెద్దలున్నార్రా నాయనా ఆ వూళ్ళో' అనే వారాయన! ఆ మాటల్ని మళ్ళీమళ్ళీ మననం చేసుకుంటూ నా అంతట నేనే యిలా మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చేశాను..." అన్నాడు.

"కానీ యివి ఆ రోజులు కావే! కాలం బొత్తిగా మారిపోయింది బాబూ! చెబితే వినేవాడూ లేడు, వినేటట్టుగా చెప్పేవాడూలేడు. అది మంచికిగానీ చెడ్డకుగానీ ఊరంతా ఒక త్రాటిమీద నడవడం మా కాలంలో రివాజు. మునసబు పెద్దిరాజుగా రుండేవారు. కరణం రుద్రప్పగారుండేవారు. ఒక రెంతచెబితే రెండోవారంత! ఇప్పుడలా కాదే! ఇంతకూ, అంతకూ రాద్ధాంతాలు, ఆపైన గూడుపుఠాణీలు పెచ్చుమీరిపోతున్నాయి. ఈ గొడవంతా మీకెందుకుగానీ మీరొకసారి వెళ్ళి మునసబుగారిని చూడండి. ఏమంటాడో చూద్దాం" అన్నాడు రంగయ్యతాత.

"మునసబుగారి ఇల్లెక్కడండీ?" అన్నాడు హరిదాసు.

"నేను చూపిస్తాను, నేను చూపిస్తాను" అంటూ పదిమంది కుర్రాళ్ళు హరిదాసు ఎదుటకు వచ్చి నిల్చున్నారు.

ఉప్పొంగిన ఆకాశగంగ శరీరాన్ని అభిషేకిస్తుండగా, యోగతపస్సులో మేనుమరచిన పరమేశ్వరుడికి మల్లే, రెండుతవ్వల మంచినూనె ధార ధారలుగా ఒంటిపైన దిగజారుతుండగా మునసబుగారు మంగలిచేత తలంటించుకుంటూ హరిదాసుకు దర్శనమిచ్చారు.

"నమస్కారమండీ!" అన్నాడు హరిదాసు.

"కళ్ళల్లో నూనె పండిదిరా నారిగా! ఆ వచ్చిందెవరో చూడు" అన్నారు మునసబుగారు.

"కేశవదాసుగారిని ఎరుగుదురు గదండీ! నేనాయన కుమారుణ్ణి. నాలుగైదేళ్ళ నుంచీ నేనూ కథలు చెబుతున్నాను. అమ్మయినా అడగందే బువ్వపెట్టదు గదండీ! అందుకని...."

"ఓహో! అలాగైతే కథ దొరుకుతుందేమోనని వచ్చారన్నమాట. మంచిదే, మీరు చెప్పనూ చెప్పొచ్చు. మేము వినినూ వినొచ్చు. కానైతే ఒక సంగతండీ హరిదాసుగారూ! నేనిప్పుడు ఊళ్ళో పెత్తనాలన్నీ చాలించుకున్నాను. మీరొక అడుగు కరణంగారి ఇంటిదాకా వెళ్ళండి" అంటూ మునసబుగారు స్నానం చేయడానికి పెరట్లోకి వెళ్ళిపోయారు.

హరిదాసు అంగవస్త్రం దులిపి భుజాన వేసుకుని కరణంగారి యింటికి దారి తీశాడు.

వివిధాకారాల దస్త్రాలమధ్య కూర్చొని కలంతో ఏదో అంకెను కొట్టివేయజూస్తున్న కరణంగారు, చెట్లతో, పొదలతో, పుట్టతో, గుట్టలతో నిండిన ఆరణ్యంతో విల్లు చేబట్టి పిట్టకు బాణం గురిబెడుతున్న కోయదొరకు మల్లే హరిదాసుకు ప్రత్యక్షమయ్యారు.

ముక్తసరిగా పరిచయమైన తర్వాత కరణంగారు సులోచనాలు సవరించుకుంటూ హరిదాసుకేసి పరీక్షగా చూచి "కేశవదాసుగారి కుమారులటండీ! సంతోషం, చాలా

సంతోషం! హరికథా కథనమంటే అది నాన్నగారి సొత్తు గదటండీ! ఆ భాషాపాటవం, ఆ సంగీత పరిజ్ఞానం. ఆ లోకానుభవం - అవి మరెవరికొస్తాయి? అన్నట్టు మీరేం పనిగా వచ్చారు?" అని ప్రశ్నించారు.

కరణంగారి గడుసు పోకళ్ళను అర్థం చేసుకోగలిగినప్పటికీ, అదేమీ బయటికి తెలియనీకుండా హరిదాసు "నేనూ అదే వృత్తి అవలంబించానండీ!" అన్నాడు.

"అలాగా! చాలా మంచిపని చేశారు. పరవృత్తులెన్నయినా కులవృత్తికి సాటి రావన్నారు. అయితే ఈ వూళ్ళో కథా గిథా ఏర్పాటు చేసుకున్నారటండీ?"

"మునసబుగారి దగ్గరకు వెళ్తే ఆయన మిమ్మల్ని చూడమన్నారు బాబూ!" సవినయంగా మనవి చేసుకున్నాడు హరిదాసు.

"ఎంతమా టెంతమాట! నన్ను చూడ్డంకన్నా వీధిలో ఆ గంగరావి చెట్టును చూడ్డం నయం కదండీ! ఏనాడయితే పంచాయితీబోర్డు అంటూ ఒకటి ఏర్పడిందో, ఆనాటినుంచీ నాకూ గ్రామ వ్యవహారాలకూ లంకె తెగిపోయింది. మీరింత దూరం రానేవచ్చారు, ప్రెసిడెంటుగారిది నాలుగోయిల్లే! వెళ్ళి ఆయన్ను కలుసుకోండి!"

హరిదాసుది అంతకే నిరుత్సాహపడిపోయే స్వభావంగాదు. అతడు ఆ ప్రెసిడెంటు గారిని కూడా ఒకసారి చూస్తే సరిపోతుంది, అనుకుంటూ మళ్ళీ వీధిలో పడ్డాడు.

రేడియోలో ప్రపంచ రాజకీయాలను గురించి వింటూ, గ్రామ రాజకీయాల్లో తమ చక్రం నిరాఘాటంగా తిరగడానికి ఉపాయాలాలోచిస్తున్న ప్రెసిడెంటుగారు ద్వారం దగ్గిరనుంచీ హరిదాసు పొడిదగ్గు వినబడగానే తలపైకెత్తి అటువైపు చూశారు.

"నమస్కారమండీ! మీరేదో ఆలోచనలో వున్నట్టున్నారు. బహుశా నేనిలా రావడం..." అంటూ ముంగాళ్ళకు బంధం పడినట్టు ద్వారం దగ్గరే ఆగిపోయాడు హరిదాసు.

"అబ్బే, నా ఆలోచనకేం గానండి, మీబోటివారెవరైనా యిలా రావడమే నాకెంతో ఆనందం! ఇంతకూ, ఇదివరకెప్పుడూ మీతో పరిచయం కలిగినట్టు లేదు..." అంటూ హరిదాసువైపు పరకాయించి చూడసాగారు ప్రెసిడెంటుగారు.

"నీ మర్యాద కాలిపోనూ! కూచోమని ఒక్కమాట చెప్పకూడదయ్యా మహానుభావా!' అనుకుంటూ తనే స్వయంగా ఓ కుర్చీని అలంకరించి "ఉదయం ఎనిమిది గంటలకే ఈ వూరొచ్చానండీ! రాగానే వెళ్ళి మునసబుగారిని కలుసుకున్నాను. ఆయన కరణంగారిని దర్శించమన్నారు. కరణంగారు మీ దగ్గరకు దారి జూపించారు. అసలు నేను మొట్టమొదట మిమ్మల్నే కలుసుకోవలసింది!" అంటూ తన అవివేకానికి తానే నొచ్చుకున్నాడు హరిదాసు.

"ఇప్పుడైనా మించిపోయిందేముంది గానీండి, ఇంతకు మీరేం పనిగా వచ్చారో..." అన్నారు ప్రెసిడెంటుగారు.

"హరికథలు చెప్పుకొనేవాడికి వేరొక పనేముంటుందండీ? స్వంత పని మీదనే వచ్చాను..."

"వచ్చారూ..."

"రాకేం చేస్తానండీ! ఊళ్ళో ఎదురైన వాళ్ళందరూ మీ మాటే చెబుతుంటే! 'మీరొకసారి ప్రెసిడెంటుగారిని చూడండి? నిస్సందేహంగా మీ పని రైటయిపోతుంది!' ఎవరి నోట విన్నా యిదేమాట!"

"వాళ్ళ మాటలకేం లేండి! తల మాసినవాడెవడైనా దొరికితే శుభ్రంగా వాడి చాపకిందికి నీళ్ళు తేవాలన్నదే వాళ్ళప్లాను! అలాంటి మాటలు పట్టించుకోకండి. వేళకు సరిగ్గా వచ్చినట్టున్నారు. ఈ పూట మా యింట్లో భోజనం చేసి వెళ్ళండి..."

"నాలుగువందల గడపలున్న ఈ వూళ్లో భోజనానికేం కొదవండీ! రాత్రికి కథమాట సెలవిచ్చారు కాదు..."

"ఇదేం ఒకరింటి శుభకార్యమా హరిదాసుగారు! అందరితోనూ మాట్లాడి చూడండి..."

"అందరూ మీతోనే మాట్లాడమన్నారండీ!"

"అన్నారూ! అనేవుంటారు లెండి! అయినా గ్రామంలో మునసబూ, కరణం గార్లుండగా జీతం బత్తెం లేని కొలువు చేసే నా మాట ఎవడు వింటాడండీ, మీ చాదస్తంగానీ..." ప్రెసిడెంటుగారు తేల్చి మాట్లాడేశారు.

'ఇంత చేశావా భగవంతుడా!' అనుకుంటూ హరిదాసు ప్రెసిడెంటుగారి యింటినుంచి బయటికి వచ్చేటప్పటికి నడిమింట సూర్యభగవానుడు నిప్పులు గ్రక్కుతున్నాడు.

అంతవరకూ రచ్చపైన్నే కూచుని ఒకరి ముఖం ఒకరు చూచుకుంటూ గోళ్ళు గిల్లుకుంటున్న హరిదాసు అనుచరులు అతడు కనబడగానే "ఏమైంది? పండా, కాయా?" అని ఏక కంఠంతో ప్రశ్నించారు.

ప్రశ్నించిన సహచరులవైపు చూస్తూ హరిదాసు, "సోదరులారా! సావధానంగా వినండి" అంటూ అప్పుడొక ఉపాఖ్యానాన్ని సెలవిచ్చాడు – "ఒకా నొక వూళ్ళో ఒక ఆయవారపు బ్రాహ్మణుడు. అతడు ప్రతిరోజూ ఒక యింటి ముంగిట నిల్చి 'భవతీ భిక్షాందేహి' అనేవాడు. ఆ యింటి యజమానురాలు గూడా మామూలు తప్పకుండా 'ఈ రోజు యింట్లో బియ్యం నిండుకున్నాయి. వెళ్ళిరమ్మని' చెబుతుండేది. ఓ రోజు బ్రాహ్మణుడు వీథిన బడిపోతుండగా ఆ యిల్లాలు ఎదురై 'ఏమండీ, మాయింటి కెళ్ళొచ్చారా?' అని పరామర్శించింది. 'వెళ్ళానండీ! మీ కోడలుగారు కూడా మీ పాఠాన్నే వల్లించారు!' అన్నాడు బ్రాహ్మణుడు. 'ఆ మాట చెప్పడాని కదెవ్వతె?' అంటూ మండిపడి అత్తగారు బ్రాహ్మణుణ్ణి మళ్ళీ యింటికి తీసుకెళ్ళింది. తీసుకెళ్లి తను స్వయంగా బియ్యం లేవని చెప్పి పంపించింది..."

"ఇదేమిటయ్యా బాబూ! హరికథలో చెప్పవలసిన ఓ పిట్టకథను తీసుకొచ్చి మాతో చెబుతున్నావు! బోధివృక్షం క్రింద మాకీ జ్ఞానోపదేశమేమిటి?" అంటూ తెల్లబోయాడు హనుమంతు.

"ఈ వూరికి అత్తగార్లు ముగ్గురు" అన్నాడు హరిదాసు.

"అందరూ మొండిచెయ్యే చూపించారేమిటి?"

"చూపిస్తే మాత్రం! ఇవ్వని మొండి అంటూ ఒకడున్నప్పుడు వాటితో బాటు విడువని చండిగూడా ఒకడుంటాడు గదా!"

"కానీ మనం 'పెడతావా లేకుంటే నీ కుండలో దూకమంటావా' అని యింటి ముందర ప్రాణాచారం పడగలమటయ్యా?" అన్నాడు మృదంగం సుబ్బయ్య.

"ఎందుకూ? కథకోసమంటూ వచ్చి చెప్పకుండా వెళ్ళిపోతామా? ఒక్కనాటికీ అలా జరగదు. ఏ కుర్రాడికైనా రెండు రూపాయలు పారేస్తే కొబ్బరి మట్టలు తెచ్చి పందిరేస్తాడు. భజనగుడి కెలాగూ పెట్రమాక్సులైటు వుంటుంది. నువ్వు మృదంగం మ్రోగించు. హనుమంతు హార్మోనియం వాయిస్తాడు. నేను కథ ధన్ధనాయించేస్తాను" అన్నాడు హరిదాసు.

నిశ్చలంగావున్న మునసబుగారి మానసకాసారంలో రాయిపడగానే లోపలినుంచి ముళ్ళకంపలూ, మొసళ్లూ పైకిలేచాయి. బురద కలిసిన నీటితో చెరువు చెరువంతా దబకలాడుతోంది - "ఈ కరణాన్నీ, ప్రెసిడెంటునూ ఏం చేసినా పాపం లేదు. తనని పూచికపుల్లాగానైనా మతించకుండా గ్రామాన్ని తమ చెప్పుచేతుల్లో వుంచుకోవాలని వీళ్ళ ఆలోచన! వీళ్ళ ఆటలు తన దగ్గర సాగవు. అమ్మో సాగితేనా వీళ్ళు తనని 'ఉఫ్' అని గాలిలోకి వూదేయరూ! కానీ కానీ, ఈ మిడిసిపాటెంత కాలం సాగుతుంది? వీళ్ళను గుంటకు గుక్కెడు నీళ్ళు తాగించకపోతే తన పేరు పేరూగాదు, వుద్యోగం వుద్యోగమూ కాదు..."

విజయగర్వంతో నాంచారయ్య లోపలికి వచ్చాడు.

"తాంబూల మిచ్చేశావా?" అన్నారు మునసబుగారు.

"ఇచ్చేశానండీ! ఆ హరిదాసు మిమ్మల్ని అదనీ, ఇదనీ ఘనంగా పొగిడేశాడు. అప్పుడా కరణంగానీ, ప్రెసిడెంటుగానీ అక్కడుంటే ఠారున గుండె పగిలి చచ్చిపోయే వాళ్ళు..."

"అలాగా!" అంటూ లోలోపలే ఆనందవివశుడైపోయాడు మునసబుగారు.

"కానీ, ఆ తరువాత ఒక చిన్న విషయం జరిగిందండీ!"

"ఏమిటది?"

"మునసబుగారి కథ, రేపేనంటూ మన తాంబూలాన్ని తీసి బెంచీపైన పెట్టాడో లేదో, కరణంగారి మల్లయ్య ముందుకొచ్చేసి హరిదాసుగారికి ఆకులు పోకలు అందించి 'ఇది కరణంగారి తాంబూలమండీ' అన్నాడు."

మునసబుగారి నోట మాటలేదు!

"నాకూ చోద్యంగానే వుందండీ బాబుగారూ! 'అయ్యలారా! రేపాదివారం రాత్రికి కరణంగారి కథ' అంటూ మల్లయ్య యిచ్చిన తాంబూలాన్ని బెంచీపైన పెట్టి యిలా తిరిగాడో లేదో యింతలో ప్రెసిడెంటుగారి పుల్లయ్య అక్కడ పూడిపడి 'ఇదిగోనండీ, ప్రెసిడెంటుగారి తాంబూలం' అన్నాడు..."

"ఇదేం గారడీరా నాంచారూ! అయితే ఈ రోజు కథెవరు చెప్పించినట్లు?" తెల్లబోతూ ప్రశ్నించారు మునసబుగారు.

ఒక్క మునసబుగారే కాదు. ఇంచుమించు అదే సమయానికి కరణంగారు మల్లయ్యను సరిగ్గా అదేవిధంగా ప్రశ్నించి మునసబుగారికి డిటోగా అదే ప్రకారం తెల్లబోయారు.

ఈ గొడవతో తనకేమీ ప్రసక్తి లేనట్టు హరిదాసు భగవంతుడిముందు, భగవంతుడి నామరూపాలకు మంగళం పాడుతున్నాడు!

♦ యువ దీపావళి సంచిక - 1976 ♦